'కోడిపందేల కేసు' చర్చనీయాంశం

- పందేల సమాచారంతో స్థావరంపై 'పేట' పోలీసుల దాడి
- పది మంది జూదరులు అదుపులోకి.. 9 బైకులు స్వాధీనం..
- కేసులో నిర్వాహకుడి పేరులో మిస్.. జూదరుల ఆగ్రహం..
- నిర్వాహకుడిని తీసుకొస్తేనే తామూ వస్తామంటూ అల్టిమేటం
- ఖర్చులకు కానిస్టేబుల్ డబ్బు లడుగుతున్నాడంటూ విస్మయం

అశ్వారావుపేట, జూన్ 5: అశ్వారావుపేట మండలంలో ఇటీవల చోటుచేసుకున్న కోడిపందేల ఘటనలో కేసు కమామీషు స్థానికంగా చర్చనీయాంశమైంది. స్థావరంపై పోలీసులు దాడి చేయడం, పదిమందికి అదుపులోకి తీసుకోవడం, నిర్వాహకుడిని కేసు నుంచి తప్పించడం, దానిపై జూదరులు ఖంగుతినడం, ఖర్చుల కోసం కానిస్టేబుల్ డబ్బులడగడం వంటి ఆకస్తికర అంశాలు చోటుచేసుకున్నాయి. మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో ఈ నెల 2న ఓ నిర్వాహకుడు కోడి పందేలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు స్థావరంపై దాడి చేశారు. అక్కడ పది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తొమ్మిది బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో నారాయణపురానికి ఒక బైక్‌ను ఒక కానిస్టేబుల్ వదిలేశాడు. అలాగే, సాయంత్రం కావడంతో జూదరుల ఫోన్ నెంబర్లు, వారి వాహనాల నెంబర్లు నమోదు చేసుకున్నారు. బైకులు తీసుకొని మరుసటి రోజు పోలీసు స్టేషన్‌కు రావాలని చెప్పి పంపించారు. 3న జూదరులు బైకులు తేకుండా వచ్చారు. అలా కుదరదని, 4న బైకులు తేవాల్సిందేనని చెప్పారు. వారి ఆధార్ కార్డుల జిరాక్సులో తీసుకొని పంపించారు. కానీ 4న జూదరులు రాలేదు. దీంతో 5న బుధవారం కానిస్టేబుల్ గుమ్మడవల్లి గ్రామానికి వెళ్లారు. అప్పటికే పందెం నిర్వాహకుడిని కేసు నుంచి తప్పించారని జూదరులు తెలుసుకొని ఉన్నారు. నిర్వాహకుడిని తీసుకొస్తేనే తామూ వస్తామని తేల్చిచెప్పారు. దీంతో కానిస్టేబుల్ ఖంగుతిని.. విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పారు. నిర్వాహకుడిపైనా చర్యలుంటాయని చెప్పి బైకులను, జూదరులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. తీరా కేసులో పందెం నిర్వాహకుడిని పేరు లేకపోవడం, అతడి బైకును కూడా చూపించకపోవడంతో జూదరులు మరింత ఆగ్రహానికి గురై 'నమస్తే తెలంగాణ'కు సమాచారం ఇచ్చారు. పైగా ఖర్చుల కోసం తమలో ఒక్కొక్కరూ రూ.1500 చొప్పున ఇవ్వాలని ఓ కానిస్టేబుల్ డిమాండ్ చేసినట్లు జూదరులు విస్మయం వ్యక్తం చేశారు. అలాగే, స్థావరంపై దాడి సమయంలో సీజ్ చేసిన బైకులను పోలీస్ స్టేషన్‌కు తరలించకుండా నిందితులతోపాటు పంపడం కొసమెరుపు.

పారదర్శకంగా పనిచేశాం: ఎస్ఐ శ్రీరాముల శ్రీను

ఈ కోడిపందేల కేసు విషయంలో నిందితుల ఆరోపణలను నమ్మొద్దు. ఈ కేసులో మేం పారదర్శకంగా పనిచేశాం.

'పదేళ్ల' ఫలితం!

- గ్రామీణ వైద్యానికి గత కేసీఆర్ సర్కార్ ప్రాధాన్యం
- అశ్వారావుపేట సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు
- కేసీఆర్‌ను తలుస్తూ సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు

అశ్వారావుపేట, జూన్ 5 : పదేళ్ల పాలనలో కేసీఆర్ వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో ఆ ఫలాలు ప్రజలకు ఇప్పుడు అందుతున్నాయి. సర్కారు ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందుతుండడంతో సంతృప్తి వ్యక్తం చేయడంతోపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. రాష్ట్ర ఏర్పాటుకు(2014) ముందు అశ్వారావుపేట సీహెచ్‌సీలో కేవలం రోగులను పరీక్షించి మందులు మాత్రమే ఇచ్చేవారు. మందుల కొరత కూడా రోగులను వెంటాడేది. ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేసి ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వచ్చేది. 2014 తర్వాత తెలంగాణ స్వరాష్ట్ర సాధించుకోవడంతోపాటు రాష్ట్ర ప్రజలు అప్పటి టీఆర్ఎస్ పార్టీని గెలిపించి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగా కేసీఆర్ ప్రభుత్వం సామాన్యులకు కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామీణ వైద్యానికి పెద్దపీట వేసింది. దీంతో గిరిజన నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పురోగతి బాట పట్టింది. అప్పటి వరకు కేవలం 10 పడకల ఆస్పత్రిగా ఉన్న సీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా కేసీఆర్ సర్కార్ అప్‌గ్రేడ్ చేసింది. రోగులకు అవసరమైన అన్ని మందులను అందుబాటులో ఉంచి.. కొరత సమస్యను తీర్చింది. దీంతో ఆస్పత్రికి రోగుల తాడికి బాగా పెరిగింది. 2018 తర్వాత మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించింది. ముఖ్యంగా 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ ప్రత్యేకంగా జీవో జారీ చేసింది. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వర రావు తన పదవీ కాలంలో ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫలితంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, ప్రసూతి శస్త్ర చికిత్సలు, బ్లడ్ బ్యాంక్, డయాలసిస్ సెంటర్, ఎక్స్‌రే ప్లాంట్, ఆర్థో సేవలు స్థానికంగా అందుబాటులోకి వచ్చాయి. గతంలో ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో మందుల కొనుగోలుతో ఆర్థికంగా నష్టపోయారు. ఒక దశలో సర్కార్ దవాఖాన అంటేనే నేను రాను అనే పరిస్థితులు రోగుల నుంచి ఉండేవి. గత కేసీఆర్ ప్రభుత్వం రోగులకు కనీస భద్రత, మౌలిక సదుపాయాల కల్పన, ఆరోగ్యానికి కనీస భరోసా ఇవ్వడంతో పదేళ్లలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య భారీగా నమోదైంది. వైద్యులు క్లిష్టమైన కేసులను సైతం సిఫార్సులు చేయడం తగ్గించడంతో రోగుల సంఖ్య బాగా పెరిగింది. ఆస్పత్రిలో ఇటీవల విజయవంతమైన కొన్ని ఎమర్జెన్సీ వైద్య సేవలను పరిశీలిస్తే...

- మండలంలోని జమ్మిగూడెం గ్రామానికి చెందిన గర్భిణీ ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు కడుపులో బిడ్డ సుమారు 25 ఎంఎల్ ఉమ్మ నీరు తాగడమే కాకుండా పేగు మెడకు చుట్టుకోవడం, గర్భ సంచి పొరలకు రంధ్రాలు ఏర్పడడం, బిడ్డ రంగు కూడా కొంత వరకు మారిపోవడం, జన్మ స్థలంలో బిడ్డ ముఖం ఉండడంతో సాధారణ కాన్పు సాధ్యం కాదని వైద్యులు గుర్తించారు. ప్రసూతి వైద్యురాలు రాదా రుక్మిణి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. చివరికి పెద్ద ఆపరేషన్ చేసి తల్లీ, బిడ్డను కాపాడారు.
- నారాయణపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రమాదకరమైన గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పారా క్యాట్‌కు చికిత్స చేసి ఆయనను బతికించారు. కేవలం 12 రోజుల వ్యవధిలో అతడిని క్యూర్ చేసి పూర్తి ఆరోగ్యవంతుడిగా ఇంటికి పంపించారు.
- వేదాంతపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీకి పొడ పాము(రక్త పింజర) ఏడుసార్లు కాటు వేయడంతో ప్రాణాపాయ పరిస్థితుల్లో గ్రామస్తులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. నాణ్యమైన ప్రాథమిక చికిత్స అందించి తర్వాత కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక వైద్యం సకాలంలో అందించడం వల్లే మేము కాపాడగలిగామని, లేకపోతే ప్రాణాలకు ముప్పు ఉండేదని రోగి బంధువులకు చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.
- అశ్వారావుపేటకు చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అప్పటికే సదరు వ్యక్తి కాళ్లు, చేతులు స్పర్శ లేకుండాపోయాయి. నాణ్యమైన వైద్యం అందించిన వైద్యులు అలాంటి వ్యక్తి ప్రాణాలను సైతం కాపాడారు. ఇలా ఎందరో రోగుల ప్రాణాలను కాపాడడంతో కేసీఆర్ ప్రభుత్వం ముందు చూపు సాకారం చేసింది.

రోగుల సంఖ్య పెరిగింది

ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస మౌలిక సదుపాయాలు, ఇతర సేవలు అందుబాటులోకి రావడంతో రోగుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రధాన వైద్య సేవలు రోగులకు ఇక్కడే అందిస్తున్నాం. గతంలో పాయిజన్, ఇతర క్రిటికల్ కేసులను కొత్తగూడెం, ఖమ్మం సిఫార్సు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ అవసరం లేదు. క్రిటికల్ కేసులకు చికిత్స అందించే ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో అందిస్తున్న సేవలతో ప్రజలు చాలా సంతృప్తికరంగా ఉన్నారు.

– డాక్టర్ విజయ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్, అశ్వారావుపేట

7 నుంచి రామాలయంలో జ్యేష్ఠ మాసోత్సవాలు

భద్రాచలం, జూన్ 5 : ఈ నెల 7వ తేదీ నుంచి భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసోత్సవాలను ప్రారంభించనున్నారు. దేవస్థానం వేదిక కమిటీ జ్యేష్ఠ మాసంలో నిర్వహించనున్న ఉత్సవాల గురించి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి బుధవారం నివేదిక అందజేశారు. నివేదికలోని వివరాల ప్రకారం.. 7వ తేదీన శుక్రవారం సందర్భంగా సాయంత్రం స్వామివారికి సంధ్యాహారతులు, రాత్రికి చుట్టు సేవ నిర్వహిస్తారు. 9న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని రాత్రికి పునర్వసు తిరువీధి సేవ, చుట్టు సేవ చేపట్టనున్నారు. 10న పుష్యమి నక్షత్రం సందర్భంగా స్వామివారికి నిత్య కల్యాణం పూర్తయిన తర్వాత అదే వేదికపై రామయ్యకు పట్టాభిషేకం నిర్వహిస్తారు. 17న సర్వ ఏకాదశి, చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం, రాత్రికి తిరువీధి సేవ, చుట్టుసేవ జరుపుతారు. రాత్రికి స్వామి వారికి పవళింపు సేవ ఉండదు. 18న పెరియాళ్వార్ తిరునక్షత్రం సందర్భంగా ఉదయం ఆళ్వార్‌కు అభిషేక తిరుమంజనం, రాత్రికి విశేష భోగ నివేదన, ఆళ్వార్‌కు చుట్టు సేవ నిర్వహిస్తారు.

జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ

21న జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ సందర్భంగా యాగశాలలో వాస్తు హోమం నిర్వహించనున్నారు. 22న జ్యేష్ఠ పూర్ణిమను పురస్కరించుకొని 81 కలశాలతో స్నపన తిరుమంజనం, చతుఃస్థానార్చన, పూర్ణాహుతి, రాత్రికి తిరువీధి సేవ చేపడతారు. జూలై 2న సర్వ ఏకాదశి సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు అంతరాలయంలో లక్ష కుంకుమార్చన, విశేష భోగ నివేదన, రాత్రికి స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తారు. 22న జ్యేష్ఠాభిషేకం సందర్భంగా నిత్య కల్యాణం ఉండదని, 21న జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ ఉన్నందున ఆరోజు స్వామివారికి సంధ్యాహారతులు కూడా రద్దు చేశామని, భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఈవో కోరారు.

మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

- ఏడుగురు వ్యక్తుల పేర్లతో నకిలీ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు
- వివరాలు వెల్లడించిన సీఐ బాలకృష్ణ

నిందితులతో సీఐ బాలకృష్ణ

మామిళ్లగూడెం, జూన్ 5 : నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను ఖమ్మం రెండో పట్టణ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. రెండో పట్టణ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నగరం వైఎస్సార్ కాలనీకి చెందిన బొమ్మ పూర్ణచంద్రరావు, కమాన్ బజార్‌కు చెందిన దివ్వెల వెంకటమధుసూదన్‌రావు, ముస్తఫానగర్‌కు చెందిన కొత్తపల్లి సత్యనారాయణ, జమ్మిబండ ప్రాంతానికి చెందిన విజ్జగిరి శ్రీనివాస్‌లు ముఠాగా ఏర్పడ్డారు. రూ.1.50 లక్షలకు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి ఏడుగురు వ్యక్తుల పేర్లతో నకిలీ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు సృష్టించారు. దీంతో తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నలుగురు సభ్యులను బుధవారం మధ్యాహ్నం కమాన్ బజార్‌లో అదుపులోకి తీసుకున్నామని సీఐ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీలు, ఒక కంప్యూటర్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అయితే నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ల విషయంలో బాధితులెవరూ నిందితులకు ఇంకా డబ్బులు చెల్లించలేదని సీఐ వివరించారు.

లొంగిపోయిన ఐదుగురు హార్డ్‌కోర్ మావోయిస్టులు

- వారిపై ఇప్పటికే రూ.17 లక్షల రివార్డు

లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న సుక్మా జిల్లా పోలీసు అధికారులు

కొత్తగూడెం క్రైం, జూన్ 5 : మావోయిస్టు పార్టీకి చెందిన ఐదుగురు హార్డ్‌కోర్ మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పోలీసు అధికారుల ఎదుట బుధవారం లొంగిపోయారు. సుక్మా జిల్లా పోలీస్ అధికారులు, సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట నక్సలైట్ సంస్థలోని పీఎల్‌జీఏ-1వ నెంబర్ ప్లాటూన్‌కు చెందిన ఒక జంటతో సహా ఐదుగురు మావోయిస్టు లొంగిపోయారు. వారిలో సప్లై టీమ్ డిప్యూటీ కమాండర్ మడకం పాండు(రూ.8 లక్షల రివార్డు), పామేడ్ ఏరియా కమిటీ సభ్యుడు, వైద్య బృందం ఇన్‌చార్జ్ తాటి మాసా అలియాస్ మడకం మాసా(రూ.5 లక్షల రివార్డు), 10 నెంబర్ ప్లాటూన్ 'బి' సెక్షన్ కమాండర్ కొమరం దూలా(రూ.2 లక్షల రివార్డు), మడకం పాండు భార్య, పీఎల్‌జీఏ బెటాలియన్ 1వ నెంబర్ ప్లాటూన్ సభ్యురాలు ఆడ రవ్వా(రూ.లక్ష రివార్డు), సౌత్ సబ్ జోనల్ బ్యూరో ప్రెస్ టీమ్ సభ్యుడు, పార్టీ సభ్యుడు శేఖర్ అలియాస్ ముకా సోడి(రూ.లక్ష రివార్డు) ఉన్నారు. లొంగిపోయిన ఐదుగురిపై మొత్తం రూ.17 లక్షల రివార్డును ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. సీఆర్‌పీఎఫ్ సెకండ్ కమాండింగ్ ఆఫీసర్ అనామి శర్మ, సుక్మా జిల్లా అదనపు ఎస్పీ నిఖిల్ అశోక్‌కుమార్ రఖేచా వీరంతాల ఎదుట వారు లొంగిపోయారు.

రూ.10 లక్షలకు బీఎస్‌డీఏ పరిమితి పెంపు!

- ప్రతిపాదించిన సెబీ

న్యూఢిల్లీ, జూన్ 5: బేసిక్ సర్వీస్ డీమ్యాట్ ఖాతా (బీఎస్‌డీఏ) పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ బుధవారం ప్రతిపాదించింది. ప్రస్తుతం ఇది రూ.2 లక్షలుగానే ఉన్నది. సెక్యూరిటీస్ మార్కెట్‌లో రిటైల్ మదుపరుల భాగస్వామ్యాన్ని ఇంకా పెంచాలన్న లక్ష్యంలో భాగంగానే ఈ ప్రతిపాదనను తీసుకొచ్చింది. ఈ మేరకు తమ కన్సల్టేషన్ పేపర్‌లో సెబీ పేర్కొన్నది. కాగా, రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాకు మరింత బేసిక్ వెర్షనే ఈ బీఎస్‌డీఏ. 2012లో దీన్ని సెబీ పరిచయం చేసింది. స్మాల్ పోర్ట్‌ఫోలియోలున్న మదుపరులపై డీమ్యాట్ చార్జీల భారాన్ని తగ్గించాలనే ఈ బేసిక్ సర్వీస్ డీమ్యాట్ ఖాతాలను సెబీ అందుబాటులోకి తెచ్చింది. ఒక మదుపరి బీఎస్‌డీఏలో రూ.2 లక్షలదాకా డెట్ సెక్యూరిటీలను ఉంచుకోవచ్చు. డెట్ సెక్యూరిటీలు కానివి కూడా రూ.2 లక్షల దాకా పెట్టుకోవచ్చు. ఈ ప్రతిపాదనలపై ఈ నెల 26దాకా మదుపరుల నుంచి అభిప్రాయాలను సెబీ కోరుతున్నది.

సెబీ ప్రతిపాదనల్లో ముఖ్యాంశాలు

- ఎప్పుడూ కూడా ఏ రకంగానూ డీమ్యాట్ ఖాతాలో ఉన్న రుణ/రుణేతర సెక్యూరిటీల విలువ రూ.10 లక్షలను దాటరాదు.
- అన్ని డిపాజిటరీల్లో మదుపరులందరికీ తమ పేరుపై ఒక బీఎస్‌డీఏ లేదా ఒక రెగ్యులర్ డీమ్యాట్ ఖాతానే ఉండాలి.
- బీఎస్‌డీఏ గరిష్ఠ వార్షిక నిర్వహణ చార్జీలపై సమీక్షలు చేయాలి.
- పోర్ట్‌ఫోలియోల విలువ రూ.4 లక్షలదాకా ఉంటే వార్షిక నిర్వహణ చార్జీలు ఉండవు. రూ.4 లక్షలు-10 లక్షల మధ్య ఉంటే చార్జీ రూ.100.
- బీఎస్‌డీఏలో పోర్ట్‌ఫోలియోల విలువ 10 లక్షలు దాటితే ఆటోమేటిగ్గా రెగ్యులర్ డీమ్యాట్ ఖాతాగా మారిపోతుంది.
- బీఎస్‌డీఏ ఉన్నవారికి ఎలక్ట్రానిక్ స్టేట్‌మెంట్లు ఉచితం. భౌతిక స్టేట్‌మెంట్లు కావాలంటే ఒక్కోదానికి చార్జీ రూ.25.

వాణిజ్య

జీప్ నయా మాడల్

ధర రూ.29.49 లక్షలు

పుణె, జూన్ 5: నయా మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది జీప్ ఇండియా. మెరిడియన్ ఎక్స్ ప్రత్యేక ఎడిషన్‌గా ప్రవేశపెట్టిన ఈ కారు ధర రూ.29.49 లక్షలు. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. స్టైలింగ్ పరంగా, కస్టమర్ కోరుకుంటున్న విధంగా డిజైన్ చేసిన ఈ మాడల్‌లో టాపెండ్ యాక్సెసరీస్‌తో తీర్చిదిద్దింది. దేశవ్యాప్తంగా ఎస్‌యూవీలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ నయా మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

మారుతి 450 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ, జూన్ 5: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ కీలక నిర్ణయం తీసుకున్నది. వచ్చే మూడేండ్లకాలంలో పునరుత్పాదకత విద్యుత్ ప్రాజెక్టుల కోసం రూ.450 కోట్ల నిధులు ఖర్చు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ నిధులను సౌర విద్యుత్ ప్లాంట్లు, బయోగాస్ ప్లాంట్ కోసం వినియోగిస్తున్నట్లు వెల్లడించింది. 2023-24లో సంస్థ రూ.120.8 కోట్ల నిధులను ఖర్చు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 20 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, 2030-31 నాటికి 40 మిలియన్లకు పెంచడానికి సంస్థ కృత నిశ్చయంతో ఉన్నదని మారుతి సుజుకీ ఎండీ, సీఈవో హిసాషి తకేచి తెలిపారు. దీంట్లో భాగంగానే ఈ ఏడాది మానెసర్ ప్లాంట్లో బయోగ్యాస్ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నది.

సంస్కరణలకు బ్రేక్?

పాలసీ నిర్ణయాల అమలు సవాలే • బీజేపీ మెజారిటీ తగ్గడంపై రేటింగ్ ఏజెన్సీల అంచనాలు



న్యూఢిల్లీ, జూన్ 5: ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సీట్లు తగ్గడం.. సంస్కరణల అమలుకు సవాల్‌గా మారిందని ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు బుధవారం అభిప్రాయపడ్డాయి. 2014, 2019 ఎన్నికల్లో కేంద్రంలో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేంత సీట్లను బీజేపీ గెల్చుకున్న విషయం తెలిసిందే. నాడు 282, 303 చొప్పున పార్లమెంట్ స్థానాలను బీజేపీ నెగ్గింది. అయితే ఈ దఫా (2024) ఎన్నికల్లో మాత్రం సీన్ రివర్సైంది. 400 పార్లమెంట్ స్థానాలు లక్ష్యంగా బరిలోకి దిగిన మోదీ సర్కారుకు ఓటర్లు పెద్ద షాకే ఇచ్చారు. 240 సీట్లకే కాషాయ దళాన్ని పరిమితం చేశారు. ఫలితంగా లోక్‌సభ (543)లో మ్యాజిక్ ఫిగర్ (272)ను అందుకోవాలంటే ఎన్డీయే కూటమిలోని మిత్ర పక్షాల మద్దతు తప్పనిసరైంది. బీజేపీ, భాగస్వామ్య పక్షాలకు కలిపి 293 సీట్లు వచ్చిన సంగతి విదితమే. దీంతో ప్రతీ విషయంలో ఇక అందరినీ కలుపుకొని పోవాల్సిన పరిస్థితి బీజేపీకి ఏర్పడింది. ఇన్నాళ్లూ ఒంటెత్తు పోకడతో దుందుడుకు నిర్ణయాలు తీసుకున్న మోదీ సర్కారు.. ఇకపై ఆచితూచి అడుగులు వేయాల్సిందే. ఈ నేపథ్యంలో ఆర్థిక సంస్కరణల అమలు, పాలసీ నిర్ణయాలు చకచకా జరిగేలా లేవని, గతంతో పోల్చితే ఆలస్యమవుతాయని ఫిచ్ రేటింగ్స్, మూడీస్ అంచనాకొస్తున్నాయి.

ఉద్యోగ కల్పన కష్టమే?

గడిచిన పదేండ్ల సంగతి ఎలా ఉన్నా.. రాబోయే ఐదేండ్లు మాత్రం కేంద్రంలో అధికారంలోకి వచ్చే ప్రభుత్వంపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుందన్నది నిర్వివాదాంశం. ఎందుకంటే స్పష్టమైన మెజారిటీ ఏ పార్టీకీ రాకపోవడం వల్లే. దీంతో ఈ దఫా మోదీ సర్కారు ముందు అనేక సవాళ్లున్నాయని రేటింగ్ ఏజెన్సీలు హెచ్చరిస్తున్నాయిప్పుడు. ప్రధానంగా ఉద్యోగ కల్పన కష్టమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పరుగులు పెట్టాలన్నా, వృద్ధిరేటు ఇంకా పుంజుకోవాలన్నా.. సంస్కరణల అమలే కీలకమని ఫిచ్ గ్రూప్ సంస్థ బీఎంఐ అంటున్నది. గతంతో పోల్చితే ఈసారి మెజారిటీ తగ్గడం.. దేశ ప్రజలు ఇకనైనా కేంద్ర ప్రభుత్వం హిందుత్వ ఎజెండాను వీడి, ఉద్యోగ-ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడంపై, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంపై దృష్టి పెట్టాలని కోరుకోవడానికి సంకేతమేనన్న అభిప్రాయాన్ని బీఎంఐ ఆసియా అధిపతి డారెన్ టే వెలిబుచ్చారు. ఈ క్రమంలోనే బాలరాముడి ఆలయాన్ని నిర్మించిన అయోధ్య నగరం ఉన్న ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ కేవలం 33 సీట్లనే ఈసారి గెల్చుకున్నదని, 2019లో ఇక్కడ 63 స్థానాలను దక్కించుకున్నదని గుర్తుచేస్తున్నారు.

అంతంతమాత్రంగానే..

దేశంలోని అన్ని రంగాల్లో యువతను నిరుద్యోగ సమస్య భారీగా వేధిస్తున్నదని మూడీస్ తెలిపింది. వ్యవసాయ రంగంలో ఉత్పాదక రేటు కూడా తగ్గిపోయిందన్నది. ఇక ఆర్థిక క్రమశిక్షణ ఉంటేనే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)కల్లా దేశ జీడీపీలో ద్రవ్యలోటును 4.5 శాతానికి పరిమితం చేయగలరని పేర్కొన్నది. ప్రస్తుతం ఇండోనేషియా (బీఏఏ2 స్టేబుల్), ఫిలిప్పీన్స్ (బీఏఏ2 స్టేబుల్), థాయిలాండ్ (బీఏఏ1 స్టేబుల్)తోపాటు బీఏఏ రేటింగ్ ఉన్న ఇతర దేశాలతో పోల్చితే భారత ఆర్థిక పరిస్థితి ఏమంత బాగాలేదని కూడా చెప్పడం గమనార్హం. అధిక వడ్డీరేట్లు, ద్రవ్యోల్బణం కూడా ప్రధాన సమస్యగా ఉన్నాయని మూడీస్ గుర్తుచేసింది.

అభివృద్ధికి పెద్దపీట వేయాలి

కేంద్రంలో మిత్ర పక్షాల మద్దతుతో మూడోసారి గద్దెనెక్కుతున్న మోదీ సర్కారు.. అభివృద్ధికి పెద్దపీట వేయాలని భారతీయ వ్యాపార, పారిశ్రామిక రంగాల పెద్దలు కోరుతున్నారు. మౌలికాభివృద్ధి, తయారీ రంగం కీలకమని, వీటికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు అందించాలని సూచిస్తున్నారు. కాగా, ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో కూడా పాలసీ నిర్ణయాలు సజావుగా సాగగలవన్న ఆశాభావాన్ని మారుతీ సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ వ్యక్తం చేశారు. అయితే రాబోయే బడ్జెట్‌లో నిర్ణయాలు భవిష్యత్తుపై ఓ స్పష్టతనిస్తాయని మరికొందరు వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. దేశంలోకి కొత్త పెట్టుబడులు రావాలన్నా.. పారిశ్రామికాభివృద్ధి జరుగాలన్నా.. వేగవంతమైన, సాహసోపేతమైన నిర్ణయాలు అవసరమని, కూటమి పాలనలో ఇది సాధ్యమేనా? అన్న అనుమానాలూ వారు కనబరుస్తున్నారు.

> భారత్‌లో కొత్త ప్రభుత్వం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో ఏర్పడే అవకాశాలున్నాయి. దీంతో మరోసారి ప్రధానిగా మోదీనే రాబోతున్నారని చెప్పవచ్చు. బీజేపీకి తగ్గిన మెజారిటీ.. పాలనాపరమైన సవాళ్లకు, ముఖ్యంగా ఆర్థిక సంస్కరణల అమలుకు బ్రేక్ వేస్తుందనిపిస్తున్నది. **-ఫిచ్ రేటింగ్స్**

> ఈసారి బీజేపీకి పూర్తిస్థాయి మెజారిటీ లేదు. దీనివల్ల ఆర్థిక సంస్కరణల అమలు ఆలస్యం కావచ్చు. ఇది ఆర్థిక క్రమశిక్షణనూ దెబ్బతీయవచ్చు. అయితే భాగస్వామ్య పక్షాల మద్దతు బలంగా ఉంటే మాత్రం కీలక రంగాల ప్రగతికి ఢోకా ఉండదనే భావిస్తున్నాం. **-మూడీస్**

మళ్లీ 74 వేల పైకి సెన్సెక్స్

భారీగా లాభపడ్డ సూచీలు • 13 లక్షల కోట్లు పెరిగిన సంపద

ముంబై, జూన్ 5: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి లాభాల్లోకి వచ్చాయి. గత నాలుగేండ్లుగా ఎన్నడూ లేనంత స్థాయిలో మంగళవారం నష్టపోయిన సూచీలు బుధవారం అంతే స్పీడ్‌తో పెరిగాయి. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి అధికారం చేపట్టే అవకాశాలు ఉండటంతో మదుపరులు తిరిగి కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో సూచీలు మూడు శాతానికి ప